ప్రజాశక్తి

మంగళవారం 20 జూన్ 2023 5 విజయనగరం

తైక్వాండో బెల్ట్ టెస్ట్‌లో
60 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ టెస్ట్ కార్యక్రమం సోమవారం మదర్ తెరిసా క్లబ్‌లో నిర్వహించారు. 32 మంది ఎల్లో బెల్ట్, 24 మంది గ్రీన్ బెల్ట్, ముగ్గురు రెడ్‌బెల్ట్, ఒకరు బ్లూ బెల్ట్‌కు అర్హత సాధించారు. ఎగ్జామినర్‌గా అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ వేణుగోపాలరావు, అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా గగన్, రాజు, యశస్విని, చైతన్య వ్యవహరించారు. ఎంపికైన క్రీడాకారులను కార్పొరేటర్ వింత ప్రభాకర్, తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు అభినందించారు.

డెంకాడ జెవికె కేంద్రంలో బూట్లు సరిచేస్తున్న సిఆర్‌టిలు

ఈ పాటోలో కనిపిస్తున్న వారు బూట్లకు కొలతలు వేస్తూ, లేసులు సరిచేస్తూ, సైజులు చూసి ఒక దగ్గర పెడుతుంటే.. చెప్పల దుకాణంలో బూట్లు అమ్మే సేల్స్‌మేన్లు అనుకుంటున్నారు కదా..? కింది పాటోలో ఉన్న వారు అర్ధనగ్నంగా గోదాంలో బస్తాల్లోకి పుస్తకాలు ఎత్తుతుంటే కళాసీలు అనుకుంటున్నారు కదూ..? ఆ పాటోలను చూసి మీరు అలా ఊహించడంలో ఏ మాత్రమూ తప్పలేదు సుమా!. అయితే వారు చెప్పలు దుకాణంలో సేల్స్‌మేన్లు, గోదాంలో కళాసీలో కాదండి. మన జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు. అవును వీరంతా సిఆర్‌టిలు, ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు, ఐఇఆర్‌టిలు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాలుగో విడత జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధం చేసి పాఠశాలకు పంపించడానికి ప్రభుత్వం పెట్టుకున్న హమాలీలుగా మారిపోయారు. అధికారుల ఆదేశాలు కాదనలేక... ఆత్మ గౌరవం చంపుకొని కూలీల్లా పనిచేస్తున్నారు.

– ప్రజాశక్తి, పూసపాటిరేగ

జగనన్నా..
మాకు ఇదేం కర్మన్నా..?

కొత్తవలస జెవికె కేంద్రంలో పుస్తకాలు ఎత్తుతున్న బోధకులు

- బూట్లకు లేసులు కడుతూ.. బస్తాలు మోస్తూ అవస్థలు
- జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆవేదన

" డబుల్ ఎంఎ, బిఇడి చేశాను.. గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిని అందుకోలేకపోయాను. మనోవేదనకు గురవుతున్న నేను సమగ్ర శిక్షలో పార్ట్‌టైం ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యాను. అరకొర జీతమైనా.. ఆత్మ గౌరవం కోసం సమాజంలో గౌరవ ప్రదమైన వృత్తిని చేస్తున్నాను. రెండు నెలలుగా నాతో బూట్లు కొలతలు వేయించి, వాటిని సరిచేసి, లేసులు కట్టి, పాలిస్ పని చేయలేకపోతున్నాను. "

- ఇదీ ఓ ఉద్యోగి ఆవేదన

" ఎంఎ బిఇడి చేశాను. టెట్ క్వాలిఫై అయ్యాను. ఉపాధ్యాయ వృత్తి తృటిలో తప్పింది. సమగ్ర శిక్షలో 12 ఏళ్లుగా సిఆర్‌టిగా పనిచేస్తున్నాను. ఈ ఏడాది జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీలో భాగంగా మమ్మల్ని గోదాంలో కళాసీల మాదిరిగా మార్చేశారు. మాతో మూటలు మోయించడం తట్టుకోలేక పోతున్నాను. ఆత్మగౌరవం చంపుకొని భార్య పిల్లల్ని పోషించడానికి పనిచేస్తున్నాను. "

- ఇదీ మరో ఉద్యోగి ఆక్రందన

ఇదీ జిల్లాలోని సమగ్ర శిక్షలో పనిచేస్తున్న పార్టుటైం ఉద్యోగుల దీనగాథ. మండలాల్లో సిఆర్‌టిలుగా, వృత్తి విద్యా బోధకులుగా, పార్ట్‌టైం ఉద్యోగులుగా అనేక మంది పనిచేస్తున్నారు. వీరంతా పదేళ్ల నుంచి జీతం తక్కువైనా ఆత్మ గౌరవం కాపాడుకోవడానికి పనిచేస్తున్నారు. అయితే ఈ ఏడాది మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కేంద్రాల్లో వీరందరిని పర్యవేక్షకులుగా నియమించారు. రెండు నెలలుగా వీరంతా పాఠశాలలకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్నారు. అంతా బాగున్నా బూట్లకు కొలతలు వేసి, లేసులు కట్టి, సైజులు చూసి, సరిచేసి బస్తాలకు ఎత్తడం జీర్ణించుకోలేకపోతున్నారు. వేసవి సెలవులు లేకుండా మే నెల నుంచి రోజుకు రూ.100 ఇస్తూ కూలీలుగా మార్చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబ సభ్యులకు తాము చేసే పని తెలిసి మోహం చూపించలేకపోతున్నామంటూ వాపోతున్నారు. చుట్టుపక్కల వారు తమని చాలా హేళనగా చూస్తున్నారంటూ వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'జగనన్నా.. ఇదేందన్నా! మమ్మల్ని ఇలా కూలీలుగా, కళాసీలుగా మార్చేశార'ంటూ రోదిస్తున్నారు. సిఆర్‌టిలను రెగ్యులర్ చేస్తానని పాదయాత్రలో మాటిచ్చి మరిచారని, కనీసం తమను గౌరవ ప్రదమైన ఉద్యోగులుగా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తమ డిగ్రీలు చూసైనా తమ గౌరవానికి భంగం కలిగించవద్దని జిల్లాలోని వందలాది మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరుతున్నారు.

ఆర్మీ ర్యాలీకి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

జులై 20 నుంచి ఆగస్టు 2 వరకు ర్యాలీ ● ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జులై 20 నుంచి జిల్లాలో నిర్వహించే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి లైన్ డిపార్టుమెంటు అధికారులంతా తమ శాఖలకు అప్పగించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రోజుకు కనీసం వెయ్యి మంది అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉందని, పిటిసిలో ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి సూచనల మేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి కల్నల్ వినయ్ కుమార్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. పిటిసిలో బారికేడింగ్ , రన్నింగ్ ట్రాక్ , రైన్ ప్రూఫ్ షెల్టర్లు, షామియానాలు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. తాగునీరు, స్నాక్స్, తాత్కాలిక మరుగుదొడ్లు , అందరికీ ఆహారం, అల్పాహారం చూడాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్‌కు సూచించారు. అవసరం మేరకు వాహనాలను, బస్సులను ఏర్పాటు చేయాలని జిల్లా రవాణా అధికారికి సూచించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో మాట్లాడగల ఉపాధ్యాయులను అనౌన్స్‌మెంట్ కోసం ఏర్పాటు చేయాలని డిఇఒను ఆదేశించారు. కల్నల్ వినయ్ కుమార్ మాట్లాడుతూ రాత పరీక్ష ఇప్పటికే పూర్తయిందని, 10 వేల మంది ఎంపికయ్యారని తెలిపారు. వీరికి శారీరక, వైద్య పరీక్షలు పిటిసి మైదానంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా అధికారులు రిక్రూట్‌మెంట్ సహకారం అందించాలని కోరారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు, సెట్విజ్ సిఇఒ బి.రాంగోపాల్, పిటిసి ప్రిన్సిపల్ ఆదిబాబు, కమిషనర్ శ్రీరాములునాయుడు, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, డిఎస్‌పి శేషాద్రి, డిఇఒ లింగేశ్వరరెడ్డి, ఆర్అండ్‌బి ఇఇ వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

శాఖల సమన్వయంతో
ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- సివిల్, భూ తగాదాల వినతులపై రెవెన్యూ, పోలీస్ శాఖలదే బాధ్యత
- 'జగనన్నకు చెబుదాం' వినతులపై జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

ప్రజాశక్తి-విజయనగరం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

మండల స్థాయిలో శాఖల మధ్య సమన్వయంతో ప్రజా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ నాగలక్ష్మి.. అధికారులను ఆదేశించారు. అందుకోసం ప్రతి సోమవారం మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు సమావేశమై పరిష్కారంపై చర్చించాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతుల్లో ఆయా శాఖల ద్వారా సంతృప్తికరమైన రీతిలో పరిష్కారం కాని వినతులపై జిల్లా అధికారులతో శాఖల వారీగా సమీక్షించారు. పౌరసరఫరాలు, విద్యుత్తు, గృహ నిర్మాణ సంస్థ, విద్యాశాఖ, గ్రామీణ నీటిసరఫరా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, జిల్లా పంచాయతీరాజ్ విభాగం, పోలీసు, రోడ్లు భవనాలు తదితర శాఖల ద్వారా రీ ఓపెన్ అయిన వినతులపై సమీక్షించారు. జిల్లా అధికారులు తమ పరిధిలో అందిన వినతులపై ప్రతిరోజూ అవి ఏస్థాయిలో పరిష్కార దశలో ఉన్నదీ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు ఆయా వినతుల పరిష్కారంపై తుది నిర్ణయం తీసుకొని పరిశీలించాకే, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టంచేశారు. సివిల్, భూతగాదాలు, కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి వివాదాలు వంటి అంశాల్లో రెవెన్యూ, పోలీసు అధికారులు ఉమ్మడిగా చర్చించి వాటి పరిష్కారంపై నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. తమకు సంబంధం లేని వినతులు అందితే వెంటనే సంబంధిత శాఖకు సమాచారం ఇవ్వాలి తప్ప ఏమీ పట్టనట్టుగా ఉండొద్దని స్పష్టంచేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, ఎస్‌డిసిలు సూర్యనారాయణ, సుదర్శన దొర, పద్మలీల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్సుకు 232 వినతులు

కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం (గ్రీవెన్స్) కార్యక్రమానికి 232 వినతులు అందాయి. ఇందులో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 173 వినతులందాయి. పంచాయతీరాజ్ శాఖకు 15, మున్సిపల్ కార్పొరేషన్‌కు 14, గ్రామ, వార్డు సచివాలయ శాఖకు 12, గృహనిర్మాణ సంస్థకు 07, విద్యుత్తు, వైద్య ఆరోగ్యశాఖలకు 4 చొప్పున, డిఆర్‌డిఎకు 3 వినతులు అందాయి. జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఇద్దరు ఆరోగ్యమిత్రలకు ప్రోత్సాహక బహుమతి కింద రూ.5వేలు చొప్పున, ప్రశంసాపత్రాలను కలెక్టర్ అందజేశారు. డిఎంహెచ్ఒ భాస్కరరావు, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ సమన్వయ అధికారి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలని వినతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్పందనలో వినతి అందజేసేందుకు వచ్చిన సాయికాలనీ మహిళలు

కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలంలో ఉన్న భవనాన్ని తొలగించి, సామాజిక భవనం నిర్మించాలని గాజులరేగలోని సాయికాలనీ మహిళలు కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుచేశారు. గతంలో కుట్టు శిక్షణ నిర్వహించిన భవనం మూతపడిందని, దీనిని కొంతమంది కబ్జాదారుల సాయంతో కోరాడ గోవిందమ్మ ఆక్రమించుకుందని తెలిపారు. ఈ భవనం పక్కన ఉన్న శిథిలమైన ఆరోగ్య ఉపకేంద్రం ఉందని చెప్పారు. ఆ రెండింటి స్థానంలో సామాజిక భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, ముత్యాలు, రామలక్ష్మి, అప్పలనారాయణ, శంకరి, సుజాత పాల్గొన్నారు.

పశువుల కమేళాలపై చర్యలు తీసుకోవాలి

కొత్తపేట శ్మశానం వద్ద అనధికారికంగా నిర్వహిస్తున్న పశువుల కమేళాలపై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ కార్యదర్శి బంగారుబాబు, కనకల మురళీమోహన్, యూత్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్దిల ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. జంతువుల తలలను విచ్చలవిడిగా డంపింగ్ యార్డులో, ఆ చుట్టుపక్కల పారేస్తున్నారని తెలిపారు. వైఎస్ఆర్ నగర్ మీదుగా సుమారు 20 గ్రామాలకు వెళ్లే మార్గం పక్కనే ఇదంతా జరుగుతోందని చెప్పారు. దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కుక్కలు వాటిని తిని, ప్రజలపై దాడి చేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి ఐవిపి రాజు, గంటా పోలినాయుడు, శ్రీనివాసరావు, రాజు పాల్గొన్నారు.

హైవే భూసేకరణలో నష్టపోయిన
రైతులకు పరిహారమివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

పెందుర్తి–బొడ్డవర ఎన్‌హెచ్ 516–ఇ రహదారి భూసేకరణలో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ భూనిర్వాసితుల పోరాట కమిటీ (ఎపి రైతుసంఘం అనుబంధం) ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ చల్లా జగన్ మాట్లాడుతూ హైవే భూసేకరణలో చిన్న, పేద రైతులు ఉన్న కొద్దిపాటి భూములు కోల్పోతున్నారని చెప్పారు. ఇప్పటికే పోలవరం సుజల స్రవంతి కాలువ, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, ఆయిల్ పైపులైన్, రైల్వే కారిడార్‌కు భూములు కోల్పోయారని, మరోసారి భూసేకరణ చేపడితే ఎలా బతకాలని ప్రశ్నించారు. భూములు కోల్పోతున్న వారికి నివాస స్థలంగా పరిగణలోకి తీసుకుని, గజాల కింద పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోడ్డు పక్కన చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపి, పరిహారం అందించాలన్నారు. కొత్తవలస, శృంగవరపుకోట రింగ్‌రోడ్డు కాకుండా ఉన్న రహదారిని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ధర్నాలో కో కన్వీనర్ గొంప కృష్ణమూర్తి, ఎం.రమణ, కె.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

ఆ ఎంఇఒలను సస్పెండ్ చేయాల్సిందే

కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అవినీతికర ఎంఇఒలను సస్పెండ్ చేయాలని, డిగ్రీ విద్యలో క్లస్టర్ విధానం రద్దు చేయాలని సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలు విద్యా హక్కు చట్టాన్ని తుంగలోకి తొక్కుతూ పాఠశాల ప్రాంగణంలోనే పుస్తకాలు అమ్ముతున్నాయని విమర్శించారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన ఎంఇఒలు కాసులకు కక్కుర్తి పడుతూ పుస్తకాల అమ్మకానికి సహకరించడం హేయమైన చర్యన్నారు. పూసపాటిరేగ, శృంగవరపుకోట ఎంఇఒల తీరే అందుకు నిదర్శనమన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. డిగ్రీలో నూతనంగా తీసుకువచ్చిన క్లస్టర్ విధానం ఉన్నత విద్యని నాశనం చేసేలా ఉందని, ఆ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. అనంతరం జెసికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పావని, జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.హర్ష , జె.రవికుమార్, ఎం.సౌమ్య, ఎం.వెంకి, నాయకులు పి.రమేష్, లావణ్య, సమీర, సోమేశ్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పశు బీమాతో ఎంతో ప్రయోజనం

ప్రజాశక్తి-విజయనగరం

వైఎస్ఆర్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. పశు పోషణపై ఆధారపడిన పశు పోషకులకు ఆపత్కాలంలో ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకానికి సంబంధించిన పోస్టర్లను, కరపత్రాలను కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేలుజాతి పశువులు, నాటు పశువులు, గొర్రెలు, మేకలు, పందులకు సైతం నిర్ణీత మొత్తాన్ని చెల్లించి బీమా సదుపాయాన్ని పొందవచ్చని చెప్పారు. వరదలు, తుపాన్లు, పిడుగుపాటు, పాముకాటు, అడవి జంతువుల దాడి, అగ్ని ప్రమాదం, రోడ్డు, రైలు ప్రమాదం, జబ్బు చేసి చనిపోవడం తదితర సందర్భాల్లో బీమా వర్తిస్తుందని తెలిపారు. బీమా చేయించుకున్న పశువులకు ఆయా రకం, వయసును బట్టి రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు, గొర్రెలు, మేకలు, పందులకు ఒక్కోదానికి రూ.6 వేల వరకు పరిహారాన్ని పొందే అవకాశం ఉందన్నారు. ప్రీమియం చెల్లించిన 24 గంటల తరువాత ఈ పథకం వర్తిస్తుందన్నారు. పశువు మరణించిన 21 రోజుల్లోగా బీమా సొమ్ము అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి సూర్యనారాయణ, పశు సంవర్థకశాఖ జెడి డాక్టర్ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అత్యాశతో ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దు

ఎస్‌పి దీపిక పాటిల్

ప్రజాశక్తి-విజయనగరం

సైబర్‌క్రైమ్ బాధితునితో మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక

అత్యాశతో ఆన్‌లైన్ మోసాల బారిన పడొద్దని ఎస్‌పి దీపిక కోరారు. మెరకముడిదాం మండలం పులిగుమ్మి గ్రామానికి చెందిన బూర్లి దామోదర్ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వచ్చి జిల్లా పోలీసు యంత్రాంగానికి, ఎస్‌పికి కృతజ్ఞతలు తెలిపారు. తనలా ఇంకెవరూ అత్యాశతో ఆన్‌లైను మోసాలకు గురికావద్దని, మోసపోవద్దని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఇంతకీ ఏం జరిగిందంటే..?

మెరకముడిదాం మండలం పులిగుమ్మి గ్రామానికి చెందిన బూర్లి దామోదర్ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్నాడు. ఆన్‌లైనులో ట్రేడింగు పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు ఆయనకు వాట్సాప్ మెసేజ్ పంపడం, వాటికి దామోదర్ స్పందించడం వల్ల మోసపోయాడు. ఏప్రిల్ 15 నుంచి 27 మధ్య గుర్తుతెలియని వ్యక్తులకు రూ.9.25 లక్షలను పది దఫాలుగా పంపాడు. ఆన్‌లైనులో ట్రేడింగు చేయుట ద్వారా తాను పెట్టిన పెట్టుబడికి 30 శాతం లాభాలు ఇస్తామని నమ్మబలకడంతో వారు పంపిన లింకులకు డబ్బులను జమ చేశాడు. మొదట్లో తాను పెట్టిన చిన్న మొత్తాలకు నమ్మకం కలిగించేందుకు లాభాలను పంపారు. ఎక్కువ మొత్తంలో నగదు పంపినప్పుడు, ఇంకా డబ్బులు పంపాలని పదే పదే మెసేజులు చేసేవారు. ఆయనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోవడం, తన డబ్బులు ఇచ్చేందుకు మరో రూ.5 లక్షలు ఇవ్వాలని చెప్పడంతో తాను మోసపోయినట్లుగా గుర్తించాడు. వెంటనే, బుదరాయవలస పోలీసుస్టేషనులో తన వద్ద ఉన్న ఆధారాలతో ఫిర్యాదు చేశారు. చీపురుపల్లి సిఐ జి.సంజీవరావు ఆధ్వర్యంలో పోలీసు బృందం ఆన్‌లైను మోసగాళ్ల వివరాలు సేకరించి, ఆయన పోగొట్టుకున్న రూ. 9.25 లక్షల్లో రూ. 8.24 లక్షలు రికవరీ చేసింది. అత్యాశతో అప్పులు చేసి, ఆన్‌లైను ట్రేడింగులో పెట్టుబడి పెట్టానని దామోదర్ తెలిపాడు. ఆన్‌లైను మోసాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఎస్‌పి కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులు, మెస్సేజులు, ఇ–మెయిల్స్‌కు స్పందించవద్దన్నారు. సైబరు మోసాలకు గురైతే, వెంటనే స్థానిక పోలీసు స్టేషనులో, 1930కు ఫిర్యాదు చెయ్యాలని కోరారు.

స్పందనకు 36 వినతులు

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి దీపిక ఆధ్వర్యాన నిర్వహించిన స్పందనకు 36 వినతులు అందాయి. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, ఏడు రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్‌పి.. సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి అస్మా ఫర్హీన్, ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ జె.మురళిలు, ఎస్‌బి సిఐలు రాంబాబు, నర్సింహమూర్తి, డిసిఆర్‌బి ఎస్ఐ వాసుదేవ్ పాల్గొన్నారు.

26 నుంచి కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు

విజయనగరం : జిల్లాలో కుష్టువ్యాధిని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం జూన్ 26 నుంచి జూలై 16వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలో చేపడుతున్న ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖలు భాగస్వామ్యం కావాలన్నారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి కుటుంబ సంక్షేమ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుర్తించని కుష్టువ్యాధి కేసులు సమాజంలో ఉండటంతో ఈ వ్యాధి వ్యాప్తి పెరిగిందన్నారు. అందువల్ల దీనిని నియంత్రించే లక్ష్యంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. క్షేత్రస్థాయిలో మహిళల్లో ఈ కేసులను గుర్తించేందుకు ఆశా కార్యకర్తల సహకారాన్ని, పురుషుల్లో వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు గ్రామ, వార్డు వాలంటీర్ల సహాయాన్ని తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి ఎల్.సూర్యనారాయణ, డిఎన్ఎంఒ జె.రామేశ్వరి ప్రభు, జెడ్‌పి ఇన్‌ఛార్జి సిఇఒ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరంకోట



పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎఐసిసి మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను స్థానిక ప్రేమసమాజంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు సుంకరి సతీష్ కుమార్ ఆధ్వర్యాన సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, అనంతరం వృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు రమేష్ కుమార్, సతీష్ మాట్లాడుతూ భారత్ జూడో యాత్ర ద్వారా ప్రజలకు రాహుల్ గాంధీ మరింత దగ్గరయ్యారని తెలిపారు. అందుకే ఆయనపై బిజెపి కక్ష సాధింపు చర్యలకు దిగిందని, దీనిని దేశ ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సెల్ నాయకులు షరీఫ్, మండల అధ్యక్షులు ఎస్.సన్యాసినాయుడు, నూర్జహాన్ బేగం, చంద్రశేఖర్, మబ్బులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా ప్రసన్నకుమార్

వేపాడ : స్థానిక తహశీల్దార్‌గా కె. ప్రసన్నకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖపట్నం నావెల్ సివిల్ డిఫెన్స్‌లో డిటిగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన కృష్ణంరాజు బదిలీపై రాజాం వెళ్లారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని కలుపుకొని ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో పనిచేస్తానని తెలిపారు.



కె. ప్రసన్నకుమార్

పవన్ కల్యాణ్‌కు జడ్ ప్లస్ భద్రత కల్పించాలి

శృంగవరపుకోట: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు జడ్ ప్లస్ భద్రత కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాసినట్లు సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వబ్బిన సన్యాసినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసిపి నాయకులు సుపారీ గ్యాంగ్‌లను ఏర్పాటు చేశారని పవన్ కళ్యాణ్ చెప్పారని వెంటనే ఆయనకు భద్రత కల్పించాలని లేఖలో పేర్కొన్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి 50 సంవత్సరాల నేర చరిత్ర ఉన్న విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. అధికారం కోసం ఏమి చేయడానికైనా వైసిపి నాయకులు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. ఎపి డిజిపి రాజేంద్ర నాథ్ రెడ్డి వైసిపికి కార్యకర్తగా పనిచేస్తున్నాడని ఆయనను డిజిపి విధుల నుండి తొలగించి రాష్ట్ర ప్రజలకు భద్రత కల్పించాలని ప్రధానమంత్రి మోడీకి రాసిన లేఖలో పేర్కొన్నట్టు సన్యాసి నాయుడు తెలిపారు.

ఉపసర్పంచ్ కుటుంబీకులకు ఎమ్మెల్యే పరామర్శ

బొబ్బిలిరూరల్ : ఇటీవల ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన అలజంగి ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఎస్‌విసిహెచ్ అప్పలనాయుడు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మునాయుడు మరణం చాలా బాధాకరమని, ఆయన మృతి చెందడం పార్టీకి తీరని లోటని అన్నారు. ముంబైలో జరిగిన జాతీయ శాసనసభ్యుల కాన్ఫరెన్స్ మీటింగ్‌లో ఉన్నందున తాను వెంటనే రాలేకపోయానని తెలిపారు. లక్ష్మునాయుడు నిరాడంబరుడు, కల్మషం లేని వ్యక్తి ఎల్లప్పుడు గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ఉండే వారని అలాంటి గొప్ప వ్యక్తి మరణ వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మహనీయుడి ఆత్మకు శాంతి చేకూరాలని తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, నాయకులు రేజేటి బుజ్జి, జేసిఎస్ కన్వీనర్లు తమ్మిరెడ్డి దామోదర్, రేజేటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న బేబినాయన

'చిరు వ్యాపారులకు అండగా ఉంటా'

బొబ్బిలి: టిటిడి కళ్యాణ మండపం ప్రహరీ పక్కన షాపులు కోల్పోయిన చిరు వ్యాపారులకు అండగా ఉంటామని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. షాపులు కోల్పోయిన వ్యాపారులను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిటిడి ప్రహరీ పక్కన షాపులు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్న పేదల కడుపు కొట్టడం అన్యాయమన్నారు. ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా షాపులు పెట్టుకుని జీవనోపాధి పొందితే అన్యాయంగా తొలగించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. చిరు వ్యాపారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయనతో టిడిపి పట్టణ అధ్యక్షులు ఆర్.శరత్, న్యాయవాది గంటి గోపాలకృష్ణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ

బొబ్బిలి: నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. పేదల ఆకలి తీర్చేందుకు 296 వారాలుగా ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నామని అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోష్, ఎల్.వాసు అన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

బొబ్బిలి: బేబినాయన జన్మదిన వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు టిడిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈనెల 24న బేబినాయన పుట్టినరోజు సందర్భంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, పువ్వల శ్రీనివాసరావు, సుంకరి సాయిరమేష్, పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

బాడంగి: మండలంలోని ఎరుకల పాకల గ్రామ దేవత ఎల్లమ్మ మూడో వార్షికోత్సవ వేడుకలు సోమవారం గ్రామంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో స్థానిక ఎస్ఐ ఆర్ జయంతి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో సర్పంచ్ పాలవలస పార్వతీ, ఎంపిటిసి, రాష్ట్ర టిడిపి ఎస్‌టి సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు పాల్గొన్నారు.

సక్రమంగా సామాజిక తనిఖీ

గజపతినగరం: సామాజిక తనిఖీ సక్రమంగా చేయాలని ఎంపిడిఒ కే.కిషోర్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బందికి 2022 – 2023 సమవత్సరానికి సంబంధించిన 17వ విడత సామాజిక తనిఖీ కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలో జరిగిన పనులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ సిహెచ్ రామారావు, జెడ్‌పిటిసి గార తౌడు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాధరావు, పిఆర్‌జెఇ పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

వారానికి ఆరు పని దినాలు

బొబ్బిలి: బస్సు పాస్ కౌంటర్‌లో వారానికి ఆరు రోజులు పని దినాలు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం డిపో మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందించారు. రవికుమార్ మాట్లాడుతూ బస్సు పాస్ కౌంటర్ మూడు రోజులు పని చేయడం వల్ల విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాబట్టి విద్యార్థులు అత్యధిక సంఖ్యలో బస్సు పాస్ చేయించుకోవడానికి వస్తున్నారని వారంలో ఆరు రోజులు కౌంటర్ పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు

బొబ్బిలి: రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ నాయకులు సోమవారం బొబ్బిలిలో ఘనంగా చేపట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, రొట్టెలు, పళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం బొబ్బిలి నియోజకవర్గ పిసిసి మెంబర్, పట్టణ అధ్యక్షులు మువ్వల శ్రీనివాసరావు, డాక్టర్ రెడ్డి శివరామకృష్ణ, యువజన నాయకులు మండపాక శ్రీనివాసరావు, సత్యనారాయణ మాస్టారు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జన్ భాగిదారిపై అందరికీ అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తలకు సోమవారం జన్ భాగిదారి కార్యక్రమంపై ఐసి డిఎస్ సూపర్ వైజర్ కామేశ్వరి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా కలిగే ప్రయోజనాలు గూర్చి భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో గర్భిణీలు, బాలింతలు, కిషోర్ బాలికల తల్లులు, గ్రామ సచివాలయ మహిళా పోలీస్ శ్రీదేవి, ఏఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు పి. మంగలక్ష్మి, దేవి, రాజేశ్వరి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

బాధ్యతలు స్వీకరించిన ఎంఇఒలు

జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో సోమవారం రెండో ఎంఇఒలుగా పలువురు ఉపాధ్యాయులు బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన కౌన్సిలింగ్‌లో వీరికి పదోన్నతి రావడంతో ఎంఇఒ-2లుగా బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా వీరికి పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి - వేపాడ

మండలానికి రెండో ఎంఇఒగా బాల భాస్కర్‌రావుని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఈయన రెండో ఎంఇఒగా బాధ్యతలు చేపట్టడంతో ఉపాధ్యాయుల సంఘాలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పూసపాటిరేగ: మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని రెండవ మండల విద్యాశాఖాధికారి బి. పాపినాయుడు అన్నారు. ప్రభుత్వం మండల విద్యాశాఖకు రెండవ ఎంఇఒను నియమిస్తు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన నేపధ్యంలో మండలంలోని కనిమెట్ల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న పాపినాయుడు పదోన్నతిపై ఎంఇఒ-2గా సోమవారం మండల విద్యశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మార్సీ సిబ్బంది ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మండలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయుల సహకారంతో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

డెంకాడ: రాధాకృష్ణకు అభినందనలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: మండలంలోని రెండో ఎంఇఒగా పాదం గణపతి లక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారని మండల విద్యాశాఖ అధికారి పెంట సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన ఎంఇఒ-2 కి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

రామభద్రపురం: మండలానికి ఇద్దరు ఎంఇఒలు ఉండాలనే నిబంధనల మేరకు నిర్వహించిన కౌన్సిలింగ్‌లో రెండో ఎంఇఒగా ఆర్.పెంటయ్య నియామకమైనట్లు స్థానిక ఎంఇఒ ఎ. తిరుమల ప్రసాద్ సోమవారం తెలిపారు. పెంటయ్య ప్రస్తుతం మామిడిపల్లి హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇకపై పూర్తి స్థాయిలో విద్యాశాఖాభివృద్ధికి కృషి చేస్తాను ఈ సందర్భంగా పెంటయ్య తెలిపారు.

నెల్లిమర్ల: మండలంలోని రెండో ఎంఇఒగా ఈపు విజయ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఎంఇఒగా విధులు నిర్వహించిన అంబళ్ల కృష్ణారావు పూసపాటి రేగ మండలం కని మెళ్ల జెడిపి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బదిలీ పై వెళ్లారు. విజయనగరం మండలం జెడిపి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేసిన ఈపు విజయ్ కుమార్ ఆదివారం జరిగిన ఎంఇఒ కౌన్సెలింగ్ ద్వారా నెల్లిమర్ల ఎంఇఒ-2గా జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ రామతీర్థం జంక్షన్ ఎంపిపి పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ పరిశీలించి విద్యార్థులతో బాటు భోజనం చేసి భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు.

డెంకాడ: మండలంలో ఎంఇఒ -2గా సిహెచ్ రాధాకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఇఒ కార్యాలయంలో ఆయన ముందుగా రిపోర్టు చేసి అనంతరం ఎంపిడిఒ, డిడి స్వరూపారాణిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈయన మెంటాడ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. దానికి ముందు నెల్లిమర్ల మండలంలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రోగ నిరోధక శక్తిని పెంచే వాటర్ అయోనైజర్

నెల్లిమర్ల: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే రోగ నిరోధక శక్తిని పెంచే అయోనైజర్ వాటర్ ఉపయోగించాలని నేచర్ డిఫెన్స్ పి.కళ్యాణి పిలుపునిచ్చారు. సోమవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో అయోనైజర్ వాటర్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. నీటిలో యాంటి ఆక్సిడెంట్లు, ఆల్కలైజేషన్, మైక్రో క్లస్టరింగ్ వంటి మూడు అంశాలు ఉన్నప్పుడు మనిషి ఆరోగ్య వంతంగా ఉంటారన్నారు. మనిషి జీవన ప్రమాణం కూడా పెరుగుతుందన్నారు. నేడు మార్కెట్లో ఉన్న మినరల్ వాటర్‌లో పిహెచ్ 3 నుంచి 4 శాతం ఉంటుందన్నారు. అదే జపాన్ రూపొందించిన అయోనైజర్ వాటర్‌లో పిహెచ్ 11 శాతం వరకు ఉంటుందన్నారు. నేడు నీరు, తినే ఆహారంలో విష పూరిత పదార్ధాలు ఎక్కువ ఉండటం వల్ల రోగాల బారిన పడుతున్నారన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరు అయోనైజర్ వాటర్ ఉపయోగించి వాడితే ఎక్కువ ప్రయోజనం ఉంటుందన్నారు. అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్.ఎన్.రాజు వారిని శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిపిఎస్ రమణారావు, ప్రొఫెసర్ శాంతమ్మ, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, అసోసియేట్ డీన్ డాక్టర్ సన్నీడియోల్, డాక్టర్ సతీష్, కంగానా వాటర్ ప్రతినిధులు టి.ఇందిర, కె.రాంబాబు, బి.సత్యనారాయణ, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడానికే ఆణిముత్యాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను మరింత ప్రోత్సహించడానికే ఆణిముత్యాలు కార్యక్రమం చేపట్టడం జరిగిందని నగర పంచాయతి వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. సోమవారం జరజాపుపేట జెడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నల్లా జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్న ఆణి ముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఛైర్మన్ చేతుల మీదుగా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సంపర్తి హేమలత, డొంక చేతన్ కుమార్, కంటిమహంతి చేతనలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూస పాటిరేగ ఎఎంసి డైరెక్టర్ పోలుబోతు నారాయణ మూర్తి, నాయకులు తుమ్ము నారాయణ మూర్తి, మన్యపురి మోహన్ రావు, నల్లి శివకుమార్, పిఎంసి ఛైర్మెన్ కాళ్ళ విజయ్‌కుమార్, అవనాపు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు

డెంకాడ : మండలంలోని అక్కివరం ఎపి మోడల్ స్కూల్లో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు జి. తనూజ, ఎం. రాధిక, రాజేష్‌లను ఘనంగా సన్మానించారు. వీరికి నగదుతో పాటు ప్రభుత్వం ప్రకటించిన మెడల్స్, ప్రశంస పత్రాలు అందజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను కూడా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ ముద్దాడ రాము, పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న వైస్ ఛైర్మన్ రామారావు

వంగర: మండలంలోని అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖండాపు జగదీశ్వరి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు పొంది పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన సివ్వాపు యేసు, ద్వితీయ స్థానం పొందిన ముళ్ళు మణికంఠ, తృతీయ స్థానం పొందిన నల్లి నీలిమలను మెడల్స్‌తో సత్కరించి వారి తలిదండ్రులను దుస్సాలువతో సన్మానించారు. అనంతరం విద్యార్థులకు నగదు ప్రోత్సహకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పున్నాన సత్యం నాయుడు, ఉపాధ్యాయులతో పాటు పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ హరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: మండలంలోని గర్భాం ఆదర్శపాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వై సాయి స్ఫూర్తి, ఎం. లలిత, టి. బ్రాహ్మణిలను వైసిపి మండల నాయకులు తాడ్డి వేణుగోపాల రావు, సత్తారు జగన్ మోహనరావు, తాడ్డి చంద్ర శేఖర్, బూర్లె సురేష్, గ్రామ సర్పంచ్ గాబ్రియేల్, ప్రిన్సిపాల్ డి. వి ఎస్ ఆరుణ తదితరులు ఘనంగా సన్మానించారు. బైరిపురం జెడ్ పిహెచ్‌లో గ్రామ ఉప సర్పంచ్ పప్పల క్రిష్ణ మూర్తి, పాఠశాల ఛైర్మన్ శింగారపు రామకృష్ణ, కందుల మళ్ళి ఖార్జునరావు, మాజీ సర్పంచ్ కెంగువ దనుంజయ ప్రథమ స్థానంలో నిలిచిన తాడేల గణేష్, ఎం రమ్యలను సన్మానించారు. సోమలింగాపురంలో సిరిపురూ కృష్ణ మూర్తి రాజు విద్యార్థులను సన్మానించారు.

పాఠ్యపుస్తకాలు లేకుండా చదివేదెలా?

ప్రజాశక్తి- గజపతినగరం

పాఠ్యపుస్తకాలు లేకుండా చదివేదెలా అని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి. రాము ప్రశ్నించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన స్పందనలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. రాము మాట్లాడుతూ ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు గత సంవత్సరం నుండి పాఠ్య పుస్తకాలు రావడంలేదన్నారు. అందుకే గతేడాది చాలా మంది విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయ్యారని గుర్తు చేశారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు వెంటనే పాఠ్య పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సరిపడా తరగతి గదులు లేకపోవడంతో ఒక గదిని రెండు భాగాలుగా చేసి తరగతుల నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం నుండి నాలుగు సంవత్సరాల ఆనర్స్ డిగ్రీని తీసుకురావడంతో ఇప్పటికే సదుపాయాలు లేక సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తెచ్చిపెడుతుందన్నారు. కావున ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సదుపాయాలు ఏర్పాటు చేయాలని, సొంత భవనాలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సాయి, కూర్మా రావు, లక్ష్మణరావు, రాము పాల్గొన్నారు.



గజపతినగరం: వినతి పత్రాన్ని అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పుస్తకాల విక్రయాన్ని అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ

శృంగవరపుకోట: మండలంలోని పోతనాపల్లిలోని హోలీ స్పిరిట్ స్కూల్‌లో బుక్స్ అమ్మకాన్ని సోమవారం ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కొర్రా రమేష్ అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా మండల కేంద్రంలో నడుపుతున్న హోలీ స్పిరిట్ స్కూల్ యాజమాన్యం బహిరంగంగా పుస్తకాలు అమ్మకం చేస్తున్నారన్నారు. వీటిపై చర్యలు తీసుకుని పుస్తకాల రూమ్‌ని సీజ్ చేయండని ఎంఇఒ సత్యానారాయణని అడిగితే పట్టించుకోలేదన్నారు. ఇలా విద్యార్థులకు న్యాయం చెయ్యాల్సిన ప్రభుత్వ అధికారులే భాద్యతారాహిత్యంగా ఉంటే పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ఎలా ప్రభుత్వ విద్య అందుతుందని, ఎలా ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందని ప్రశ్నించారు. తక్షణమే భాద్యతారాహిత్యంగా వ్యవహరించిన ఎంఇఒ పై చర్యలు తీసుకొని విద్యాహక్కు చట్టాన్ని పరిరక్షిస్తూ సామాన్య విద్యార్థులకు న్యాయం జరిగేలా జిల్లా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షాన జిల్లా వ్యాప్తంగా విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులని ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రిషి, రాము, నాయుడు పాల్గొన్నారు.

మహిళకు బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - వంగర

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని కొప్పర వలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల గూర్చి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీలు చుట్టూ కాళ్ల అరిగేలా తిరగవలసిన దుస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం వైసిపి ప్రభుత్వంతో సంక్షేమ పథకాలన్నీ అర్హతే ప్రమాణికంగా కుల మతాలకు అతీతంగా ప్రజలకు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, బొక్కేల వెంకట అప్పల నాయుడు, యలకల శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు..

క్షీణించిన శాంతిభద్రతలు : టిడిపి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైసిపి పాలనలో శాంతి భద్రతలు క్షీణించి హత్యలు జరుగుతున్నాయని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు ఆరోపించారు. సోమవారం దన్నాన పేటలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి దాష్టీకానికి రాజోలులో బాలుడుని కిరాతకంగా పెట్రోల్ పోసి హత్య చేయడమే నిదర్శనం అని అన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఈ నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో ఎక్కడా ప్రజలు మనశ్శాంతిగా జీవించే పరిస్థితి లేదన్నారు. వైసిపి నాయకులు గుండాళ్ళ వ్యవహరించి మహిళలు, దళితులు, బీసీలు అన్న తేడా లేకుండా దాడులు చేసి హత్యా రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసిపి నేతలు ఇష్ట మొచ్చిన రీతిలో అధికారంలో ఉన్నామని పెట్రేగి అల్లకల్లోలం సృష్టించి ప్రజలను, ప్రతిపక్షాలను బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం గాని పోలీసులు గాని పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు. కాగా వైసిపి పాలనలో జరుగుతున్న దాడులు ప్రజలు గమనిస్తున్నారని తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైన దాడులు నివారించడానికి చర్యలు తీసుకొని బాలుడి హత్యకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించకపోతే టిడిపి బాధితులకు అండగా నిలిచి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, తంగుడుబిల్లి ఎంపిటిసి చందక చిన్నం నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజారావు

తపాలా సేవలకు అంతరాయం

పూసపాటిరేగ: విద్యుత్ కోతలతో పూసపాటిరేగా సబ్ పోస్ట్ ఆఫీస్ తపాలా సేవలకు అంతరాయం కలుగుతుంది. పోస్ట్ ఆఫీస్‌లో ఉన్న యుపిఎస్ కూడా పనిచేయకపోవడంతో పోస్ట్ మాస్టర్లు ఏమి చేయలేనీ స్థితిలో ఉంటున్నారు. పోస్ట్ ఆఫీస్‌లో సాధారణ సేవలతో పాటు ఆధార్ అప్డేట్ సేవలు ఉండడంతో రోజు వందల సంఖ్యలో ప్రజలు వస్తున్నారు. విద్యుత్ కోతలు యుపిఎస్ పనిచేయకపోవడం ప్రజలకు సేవలు అందించలేక పోతున్నారు. తపాలా ఉద్యోగులు కూడా కొత్తవారు కావడంతో దూర ప్రాంతాలు నుంచి ఆధార్ అప్డేట్ కోసం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాలింతలు, వృద్ధులు రెండేసి మూడేసి రోజులు పాటు పోస్ట్ ఆఫీస్‌కి రావాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీనిపై స్పందించి జిల్లా పోస్టల్ అధికారులు పోస్ట్ ఆఫీస్‌కు యుపిఎస్ పునరుద్ధరణ చేసి, ప్రజలకు తపాలా సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.

వేచి ఉన్న వినియోగదారులు

ఎపిఆర్‌జెసి ఫలితాల్లో 'షైన్ ఆంధ్రా' సత్తా

ప్రజాశక్తి- విజయనగరం

జిల్లాలో జరిగిన ఎపిఆర్‌జెసి పరీక్షల్లో షైన్ ఆంధ్రా విద్యార్థులు సత్తా చాటారు. ఎంపిసి విభాగంలో జి. శశికుమార్ 515 స్టేట్ ర్యాంక్, సిఇసిలో ఎం. యోగేంద్ర 144 వ ర్యాంకు సాధించారు. వీరితో పాటు జి. భావ్యశ్రీమణి, జె. శివ, ఎం. మానస జిల్లా స్థాయిలో ర్యాంకులు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం షైన్ ఆంధ్ర కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఆవాల రమణ విద్యార్థులను అభినందించారు.

శశికుమార్

ఉపాధ్యాయుడు ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - జామి

మండలంలోని బలరాంపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న గర్భాన ఎర్ని అప్పారావు(40) అనారోగ్య కారణంతో సోమవారం అకస్మికంగా మృతి చెందారు. అప్పారావుకి బార్య, ఇద్దరి పిల్లలు ఉన్నారు. జామి, మాధవరాయమెట్ట గ్రామాల్లో పని చేశారు. పిన్న వయస్సులోనే అప్పారావు మృతి చెందడంతో జామి ఎస్‌సి కాలనీ ద్రిగ్భ్రంతి చెందింది.

మృతుడు అప్పారావు(ఫైల్)

యుటిఎఫ్ సంతాపం

జామి యూటీఫ్ మండల శాఖ ప్రగాఢ సానుభూతిని తెలియచేసి తక్షణ ఖర్చుల కోసమని అప్పారావు కుటుంబ సభ్యులకు రూ.15వేలు అందజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే. ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి. రాజారావు, మండల అధ్యక్షులు వి. వాసుదేవరావు, మండల ప్రధాన కార్యదర్శి , ఎం.తాతమ్ నాయుడు, పి. సన్యాసిరావు, ఎస్. ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - కొత్తవలస

భార్యా, భర్తల మధ్య మనస్పర్థలు, ఆర్థిక లావాదేవీల కారణంగా 42 ఏళ్ల ఓ మహిళ గ్రామంలోని భైరవ స్వామి ఆలయ సమీపంలోని వాటర్ టాంక్ పైకెక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని చింతలపాలెంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు వారించినా వినకపోవడంతో ఆమె కుమారుడు చంద్రశేఖర్ పోలీస్, ఫైర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వీరజనార్ధన్, ఫైర్ ఎస్ఐ వై. అశోక్ కుమార్ హుటాహుటీనా ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుధీర్ఘ సమయం ఆమెతో మాట్లాడి, నచ్చజెప్పి, వారించి ఎట్టకేలకు ఆమె ఏ అఘాయిత్యానికి పాలపడకుండా కిందకు దింపారు. ఈ సందర్భంగా ఆమె పోలీసులతో మాట్లాడుతూ విశాఖ పోర్ట్‌లో ఉద్యోగం చేస్తున్న తన భర్త తనను పట్టించుకోవడం లేదని, ఆర్థికంగా ఇబ్బందులు పెడుతూ మానసిక వేదనకు గురించేస్తుందటంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వివరించింది. కుటుంబ సభ్యులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇటువంటి ఘటనలకు పాల్పడితే సమస్యలకు సమాధానం కాదని, నిండు జీవితాలను బలిచేసుకోవడం తగదని సూచించారు.

మహిళను కిందకు తీసుకొస్తున్న పోలీసులు

పిడుగు పడి గొర్రెల కాపరి దుర్మరణం

బొండపల్లి: మండలంలోని తమటాడ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కోండ్రి అప్పన్న (43) పిడుగుపాటుకు మృతి చెందారు. గ్రామానికి చెందిన బద్దె చెరువు సమీపంలోని పొలంలో గొర్రెల మందను ఉంచాడు. తెల్లవారుజామున 3.30గంటలకు ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో మందను ఇంటికి తరలించే తరుణంలో పిడుగు పడి గాయపడ్డాడు. కొన ఊపిరితో ఉన్న అతన్ని స్థానికులు ఇంటికి తీసుకెళ్లేలోగా మృతి చెందాడు. మరి కొద్ది రోజుల్లో కుమారుడు వివాహం జరగనున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానిక ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

చికిత్స పొందుతూ వ్యక్తి..

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని బోడసింగిపేట గ్రామానికి చెందిన చరకాన సత్యనారాయణ (57) పురుగులు మందు తాగి మృతి చెందారు. ఈ నెల 13న సత్యనారాయణ మద్యం సేవించి ఇంటి దగ్గర గొడవ పడిన అనంతరం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మతిని భార్య మంగమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు బొండపల్లి ఎస్ఐ ఎస్ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జగ్గయ్యపేటలో సోమవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో గేదెల పావనికి చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లో ఉన్న రెండు గ్యాస్ బండ్లు, గ్యాస్ స్టవ్, సామాన్లు పూర్తిగా కాలిపోయాయి. గ్రామ ఉప సర్పంచ్ వంటాకు శ్రీను శృంగవరపుకోట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఇంతలో గ్రామస్తులందరూ మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు. సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు కూడా కుటుంబానికి అండగా ఉంటామని పెద్దలు, మహిళలు తెలిపారు.